క్లుప్తంగా

జీలుగ విత్తనాలు పంపిణీ



జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పాలకవీడు : ప్రభుత్వం సబ్సిడీపై అందించే విత్తనాలు, ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.రాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో ఆయన రైతులకు జీలుగ విత్తనాలను పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ భూక్యా గోపాల్‌తో కలిసి పంపిణీ చేసి మాట్లాడారు. 30 కేజీల బ్యాగు రూ.843లకు అందుబాటులో ఉందని తెలిపారు. విత్తనాలను రెండున్నర ఎకరాలలో చల్లుకోవాలని సూచించారు. విత్తనం కావలసిన రైతులు పట్టాదారు పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌లు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ మట్టేష్, రైతు బంధు సమితి మండల సభ్యుడు కమలాకర్ రెడ్డి, రైతులు వెంకట్‌రెడ్డి, సైదిరెడ్డి, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి జీపీ సిబ్బంది నిరవధిక సమ్మె

గరిడేపల్లి : గ్రామ పంచాయతీ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 6వ తేదీ నుంచి తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ పిలుపు మేరకు సమ్మె చేపట్టనున్నట్లు వారు తెలిపారు. శనివారం గరిడేపల్లి సంఘం జేఏసీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ వనజకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులను జీఓ 60 ప్రకారం మున్సిపాలిటీ కార్మికుల మాదిరిగా కేటగిరిల వారీగా వేతనాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

'కిట్స్' విద్యార్థులకు టాస్క్ శిక్షణ తరగతులు



అవగాహన కల్పిస్తున్న టాస్క్ ప్రతినిధి

కోదాడఅర్బన్ : పట్టణంలోని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో తెలంగాణ నైపుణ్య విజ్ఞాన సంస్థ (టాస్క్) ఆధ్వర్యంలో బీటెక్ సీఎస్‌సీ, సివిల్ రెండో సంవత్సరం విద్యార్థినులకు శనివారం పైథాన్ ప్రోగ్రాంపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల అకడమిక్ అడ్వైజర్ పోతుగంటి నాగేశ్వరరావు తెలిపారు. టాస్క్ సాంకేతిక నిపుణుడు వి.రాకేష్ శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్.నాగార్జున రావు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

కేఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో చేరాలని ప్రచారం

కోదాడఅర్బన్ : ఇంటర్ పాస్ అయిన విద్యార్థులు కోదాడలోని కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని కోరుతూ ఆ కళాశాల అధ్యాపకులు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కరపత్రాలు పంచుతూ విస్తృత ప్రచారం చేస్తున్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం.నాగు ఆధ్వర్యంలో కోదాడ, నడిగూడెం, చిలుకూరు, మునగాల, మేళ్లచెరువు, అనంతగిరితో పాటు హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఉచితంగా దోస్త్ రిజిస్ట్రేషన్ చేయించి అడ్మిషన్లు చేయిస్తున్నారు.

గొర్రెల పంపిణీలో జాప్యం

మేళ్లచెరువు : రెండవ విడత గొర్రెల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని గొర్రెల పెంపకందారుల సంఘం జిల్లా నాయకుడు సాధం గంగయ్యయాదవ్ శనివారం కోరారు. ప్రభుత్వం గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టి ఆరు సంవత్సరాలు దాటినా నేటికీ లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందించలేదని ఆరోపించారు. రెండవ విడత గొర్రెలకు గాను లబ్ధిదారుల వద్ద డీడీలు కట్టించి రెండు నెలలు దాటినా ఇంతవరకు జిల్లాలో 100 మందికి కూడా జీవాలు అందించలేదన్నారు.

'ఉత్తమ్‌పై అసత్య ప్రచారం చేస్తే ఊరుకోం'

హుజూర్‌నగర్‌రూరల్ : నల్లగొండ ఎంపీ నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ వీడుతున్నాడని అసత్య ప్రచారం చేస్తే ఊరుకోమని హుజూర్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని బూరుగడ్డలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నత ఉద్యోగం వదిలి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం నచ్చి ఆ పార్టీలో చేరి ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తున్న ఆయనపై అసత్య ప్రచారాలు మానుకోకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో యరగాని భిక్షం, నర్సింహారావు, గురవయ్య, సైదులు, నాగయ్య, వీరబాబు పాల్గొన్నారు.

సూర్యాపేటకు సైకిల్‌యాత్ర

భానుపురి : ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రెండోసారి సీఎం కావాలని కోరుతూ జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం లింగంపల్లికి చెందిన బొడ్డు ప్రవీణ్ చేపట్టిన సైకిల్ యాత్ర శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ జనగామ నుంచి తాడేపల్లిగూడెం వరకు ఈ సైకిల్ యాత్ర చేపట్టినట్లు తెలిపారు.

మూతబడిన పశువైద్యశాల

- సిబ్బంది లేక గత కొన్నేళ్లుగా మూగజీవాలకు అందని వైద్యం
- నాటు వైద్యులను ఆశ్రయిస్తున్న రైతులు
- జీవాలు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన



కొక్కిరేణిలో నిరుపయోగంగా పశువైద్యశాల

మునగాల : మండలంలోని కొక్కిరేణి గ్రామంలో గల పశువైద్యశాల ఉప కేంద్రం సిబ్బంది కొరతతో గత కొన్నేళ్లుగా మూతపడింది. ఈ ఉప కేంద్రాన్ని 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ఉప కేంద్రంలో గతంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్‌తో పాటు ఆఫీస్ సబార్డినేట్ విధులు నిర్వర్తించేవారు. అయితే లైవ్ స్టాక్ అసిస్టెంట్‌కు ప్రమోషన్ రావడంతో ఇక్కడి పోస్టు ఖాళీ అయింది. నాటి నుంచి నేటివరకు ప్రభుత్వం ఈ ఉపకేంద్రానికి సిబ్బందిని నియమించలేదు.

నాటు వైద్యులను ఆశ్రయిస్తున్న రైతులు

కాగా, కొక్కిరేణి పరిసర గ్రామాలలో సుమారు పదివేలకు పైగా పశుసంపద ఉందని పశువైద్యశాల మూతపడటంతో పశు వైద్యానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయా గ్రామాల సర్పంచ్‌లు చెబుతున్నారు. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు పలుమార్లు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఫలితం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామ సీపీఎం నాయకుడు, సర్పంచ్ కీ.శే బహుదొడ్డి రామారావు.. ఆయన సర్పంచ్‌గా పనిచేస్తున్న సమయంలో పశువైద్యశాల నిర్మాణానికి తన భూమిని విరాళంగా ఇచ్చారు. దీంతో 1992లో మండల సాధారణ నిధులు, జవహర్ రోజ్‌గార్ యోజన నిధులతో వైద్యశాల భవనం నిర్మించారు. దీంతో ఈ వైద్యశాల కొక్కిరేణితో పాటు వెలిదెండ, కొనాయిగూడెం, తిమ్మారెడ్డిగూడెం, చెట్లముకుందాపురం, శ్రీరంగాపురం చెందిన గ్రామాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడేదని ప్రజలు తెలిపారు. పశు వైద్యశాల మూతపడటంతో మూడు సంవత్సరాలుగా మూగజీవాలకు వైద్యసౌకర్యం అందక మృత్యువాత పడుతున్నాయిని ఆయా గ్రామా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక నాటు వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోందని అంటున్నారు. ఇప్పటికైనా పశువైద్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి పశువైద్యశాలకు సిబ్బందిని నియమించి వైద్యశాలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు. కాగా ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఈ వైద్యశాలలోని రెండు గదులలో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పల్లెదవాఖాన నిర్వహిస్తున్నారు.

సిబ్బందిని నియమించాలి



కొక్కిరేణిలో పశువైద్యశాల ఉపకేంద్రంలో సిబ్బంది లేకపోవడంతో మూడేళ్లుగా మూతపడింది. ఫలితంగా కొక్కిరేణితో పాటు పరిసర గ్రామాలలో గల పదివేల పశుసంపదకు వైద్యం అందడం లేదు. దీంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. తక్షణమే ప్రభుత్వం స్పందించి సిబ్బందిని నియమించాలి.

– మాజీ సర్పంచ్, కొక్కిరేణి

మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి



కొక్కిరేణి పశువైద్యశాల ఉపకేంద్రం మూతపడటంతో ఈ ప్రాంతంలో గల పశుసంపదకు వైద్య సౌకర్యం లేకపోవడంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. మూగజీవాలకు వైద్యం చేయించాలంటే పది కి.మీ.దూరంలో ఉన్న కీతవారిగూడెం లేదా మునగాలకు వెళ్లాల్సి వస్తోంది. ఉపకేంద్రాన్ని పునరుద్ధరించాలి.

– ఎల్లావుల వెంకన్న, కొక్కిరేణి

జిల్లా అధికారి దృష్టికి తీసుకెళ్లా



కొక్కిరేణి పశువైద్యశాలలో గత కొంతకాలంగా సిబ్బంది లేని మాట వాస్తవమే. గతంలో ఇక్కడ పనిచేసిన సిబ్బంది బదిలీపై వెళ్లడంతో ఖాళీ ఏర్పడింది. ఈ విషయమై నేను జిల్లా పశువైద్యధికారి దృష్టికి తీసుకువెళ్లాను. జిల్లాలో బదిలీ లేదా ప్రమోషన్‌పై వచ్చే సిబ్బంది ఉంటే కొక్కిరేణికి కేటాయిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

– భాస్కర్, మండల పశువైద్యాధికారి, మునగాల

నేడు వీరారెడ్డి వర్ధంతి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెంలో ఆదివారం తెలంగాణ రైతాంగ సాయిధ పోరాట యోధుడు ఉప్పెల వీరారెడ్డి ఐదవ వర్ధంతిని నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉప్పెల నారాయణరెడ్డి తెలిపారు. శనివారం చింతలపాలెం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఐ మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వీరారెడ్డి వర్ధంతి కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్న చంద్రశేఖర్, రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సృజన, సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. వీరారెడ్డి వర్ధంతి కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీపీఐ పార్టీ మండల కార్యదర్శి చింతిరాల రవి, మహిళ సమాఖ్య మండల అధ్యక్షురాలు భీమ్ శెట్టి పద్మ, పార్టీ నాయకులు గొంగరెడ్డి వెంకటరెడ్డి గంధం మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

జూలైలో 'చలో హైదరాబాద్'

నూతనకల్ : ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత సాధనకై జూలై మూడవ వారంలో నిర్వహించే చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాల్వాయి బాలయ్య కోరారు. శనివారం మండల పరిధిలోని వెంకెపల్లిలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కందుకూరి శ్రీను, పాల్వాయి పరశురాములు, కొండగట్టు శ్రీను, రాంపాక సత్యం, రాంపాక విజయ్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు బోనాలు



బోనాలతో ప్రదర్శనగా తరలివెళ్తున్న మహిళలు

మునగాల : మునగాల మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి దేవాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని ముదిరాజ్ కులస్తులు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకొని ప్రదర్శనగా వెళ్లి చెరువుకట్టపై గల అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా గ్రామంలో ప్రభబండ్ల ప్రదర్శన నిర్వహించారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొన్నది. ముదిరాజ్ కులస్తులు, భక్తులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

వాసవీ, వనితా క్లబ్‌ల సేవలు అభినందనీయం



రైతులను సన్మానిస్తున్న వాసవీ, వనితా క్లబ్‌ల సభ్యులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల వాసవీ, వనితా క్లబ్‌ల సేవాలు అభినందనీయమని ఆ క్లబ్‌ల ఐఈసీ ఆఫీసర్ నంబూరి వెంకటపద్మ, ఐపీసీ గ్రంధి ఎస్ఎన్ నర్సింహరావు, ఆర్‌సీ రాయపూడి భవానీ, ఆర్ఎస్ తిరునగరు పద్మావతి, జెడ్‌సీ లావణ్య, ఆర్ఈసీ వీరవెల్లి పద్మావతి అన్నారు. శనివారం నేరేడుచర్లలో వాసవీ, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో జై జైవాన్– జై కిసాన్ పేరుతో వాసవీ, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా క్లబ్‌ల ద్వారా రైతుబంధు పేరుతో ఎరువులు, ఆర్యవైశ్య నిరుపేదలకు 25 కిలోల బియ్యం, మహిళలకు చీరలు, పురుషులకు పంచలు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం రైతులను సత్కరించారు. కార్యక్రమంలో వాసవీ, వనితా క్లబ్‌ల అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, శ్రీలత, పాలిశెట్టి సంధ్య, భాగ్యలక్ష్మి, కోటేశ్వర్‌రావు, అరుణకుమారి, అశోక్, వాసంతి, ఇందిర, సువర్ణ, స్వామి, సుధాకర్, నటరాజ్, గోపాలకృష్ణ, వినయ్, ధనలక్ష్మి, శోభ, జ్యోతి, మహాలక్ష్మి, కరుణ దాతలు పాల్గొన్నారు.

పెరిగిన రామాలయ భూమి కౌలు ధర

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో గల శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో శనివారం ఆలయ భూమి 22 ఎకరాలకు ఈ ఏడాదికి కౌలు బహిరంగ వేలం పాటను దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీంతో గ్రామానికి చెందిన వట్టికూటి నాగయ్య, యగ్గడి రామారావు, గుండు గోపి, నెమ్మాది వసంతరావులు రూ.25 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొన్నారు. వీరిలో వట్టికూటి నాగయ్య రూ.5 లక్షల 50 వేలకు వేలం పాటను దక్కించుకున్నాడు. పోటీ పెరగడంతో గతేడాది కంటే ఈ ఏడాది రూ.1.30 వేలు కౌలు పెరిగింది. కార్యక్రమంలో వేలం పాట పర్యవేక్షణ అధికారి రమేష్, ఆలయ మేనేజర్ మృత్యుంజయ శాస్త్రి, ఎంపీటీసీలు నెమ్మాది సైదాబాబు, వట్టికూటి ధనమూర్తి, ఆలయ చైర్మన్ ఎగ్గడి శ్రీనివాస్, ఆలయ పూజారి నాగేంద్ర బాబు, ధర్మకర్త మండలి సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై 26న నిరసన

నడిగూడెం : పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని రిటైర్డు ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు ఎండీ.ఖలీల్ అహ్మద్, కార్యదర్శి దున్నా అంజయ్య ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పెన్షనర్ల సమస్యలపై ఈ నెల 26న తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో మండలానికి చెందిన రిటైర్డు ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

మునగాల : జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు బండి సతీష్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కిసాన్ సంఘ్ జిల్లా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యుత్, రెవెన్యూ, ధరణి సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని కోరారు. కిసాన్ సంఘ్ బలోపేతానికి వచ్చే జనవరిలో జరిగే సభ్యత్వ అభియాన్‌లో 20 వేల మంది రైతులను సభ్యులుగా చేర్చుకోవాలని దీనికి జిల్లాల బాధ్యులు మండలాల వారీగా 100 గ్రామాలను ఎంపిక చేసుకొని ఇప్పటి నుంచే ప్రయత్నాలు ముమ్మరం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్యాల వెంకటరెడ్డి, రాష్ట్ర సేంద్రియ వ్యవసాయ అధ్యక్షుడు అర్వపలి వీరభద్రరావు, జిల్లా కార్యదర్శి అబ్బిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీలో హుజూర్‌నగర్ వాసులకు చోటు

హుజూర్‌నగర్ : తెలుగుదేశం పార్టీ విద్యార్థి విభాగం టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీలో హుజూర్‌నగర్ నియోజకవర్గానికి రెండు పదవులు లభించాయి. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ఉండేటి సతీష్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎంపికయ్యారు. మండలంలోని లక్కవరంనకు చెందిన కస్తాల మహేష్ రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు వారు శనివారం తెలిపారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



కోదాడలో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ముదిరాజ్‌లు

కోదాడఅర్బన్ : ముదిరాజ్ కులస్తుల మనోభావాలు దెబ్బతినెలా మాట్లాడిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని ప్రభుత్వం వెంటనే బర్తరఫ్ చేసి ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు బుడిగ అంజయ్య, భాషబోయిన భాస్కర్‌లు డిమాండ్ చేశారు. శనివారం కోదాడ పట్టణంలోని రంగా థియేటర్ సెంటర్ చౌరస్తాలో కౌశిక్‌రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌశిక్‌రెడ్డి హుజూరాబాద్‌లో మీడియాలో పనిచేస్తున్న అజయ్‌ను దుర్భాషలాడారని, అలాగే ముదిరాజ్ కులంను అసభ్య పదజాలంతో దూషించాడని తెలిపారు. ముదిరాజ్ కులస్తులకు కౌశిక్‌రెడ్డి బేషరత్తుగా క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆయనను అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు మూసి శ్రీనివాస్, తేనే ధనుంజయ, చాపల శ్రీను, పి.రామయ్య, సారగండ్ల సత్తయ్య, వీరబాబు, ఎల్లయ్య, మల్సూర్‌అలీ, వీరబాబు పాల్గొన్నారు.

బీజేపీ మండల ఉపాధ్యక్షుడు చక్రం మృతి



చక్రం మృతదేహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నడిగూడెం : మండల పరిధిలోని చాకిరాల గ్రామానికి చెందిన బీజేపీ మండల ఉపాధ్యక్షుడు రాంపల్లి చక్రం (50) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు. ఆయన బీజేపీలో క్రియాశీలకంగా పనిచేశారు. ఆయన అకాల మృతి పట్ల ఆ పార్టీ రాష్ట్ర నాయకురాలు నూకల పద్మావతి, మండల అధ్యక్షుడు దున్నా సతీష్, ప్రధాన కార్యదర్శి మేకల నాగరాజు, నాయకులు షేక్.లతీఫ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు బండారు శోభారాణి, కొండయ్య తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

జయరాములు మృతి పార్టీకి తీరని లోటు



జయరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

హుజూర్‌నగర్‌రూరల్ : సీపీఎం సీనియర్ నాయకుడు ఎల్లంశెట్టి జయరాములు మృతి పార్టీకి తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని లింగగిరిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జయరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్నాటి అంజిరెడ్డి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగారపు పాండు, జిల్లా కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి, మండల కార్యదర్శి హుస్సేన్, బ్రహ్మం, నిజాముద్దీన్, శ్రీను, మురళి, చిన్నరాములు, వెంకటరెడ్డి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అందని సంక్షేమ పథకాలు



భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న కామళ్ల నవీన్

నేరేడుచర్ల : వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ముకుందాపురం గ్రామంలో భవన నిర్మాణ కార్మికులకు ఆయన గుర్తింపు కార్డులు పంపిణీ మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు అందాల్సిన సంక్షేమ పథకాలు అందడం లేదని, వారికి లెబర్ కార్డులు, ఇన్సురెన్స్ కార్డులు లేవని అన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డులు, ఇన్సురెన్స్ కార్డులు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎల్లయ్య, సుధాకర్, వెంకన్న, సైదులు, మంగయ్య, సోమయ్య, నాగయ్య, నాగమ్మ, అంజయ్య తదితరులున్నారు.

టీడీపీ నాయకులకు సన్మానం



కొల్లు నర్సయ్య, పట్టా నాగరాజును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

చిలుకూరు : టీడీపీలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో పదవులు దక్కించుకున్న చిలుకూరు గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు కొల్లు నర్సయ్య, పట్టా నాగరాజులను శనివారం ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా, మండల నాయకులు ముత్తినేని సైదేశ్వర రావు, నంబూరి సూర్యం, ఉప్పుగండ్ల శ్రీనివాస్‌రావు, దొడ్డా గురవయ్య, కొండా సోమయ్య, కొల్లు సత్యనారాయణ, శోభన్‌బాబు, వీరబాబు, సైదిరెడ్డి, నర్సిరెడ్డి, లక్ష్మయ్య, శ్రీను, సురేష్, పుల్లారావు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

గేదెల కళేబరాలను తొలగించాలి

మునగాల : మండల పరిధిలోని జాతీయ రహదారిపై ప్రమాదానికి గురై మృతిచెందిన గేదెల కళేబరాలను రోడ్ల పక్కన నుంచి తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కళేబరాలను వాటి యజమానులు తీసుకెళ్లకుండా అక్కడే వదిలి వెళ్లడంతో అవి కుళ్లిపోయి కుక్కలు పీక్కతింటున్నాయి. కళేబారాలను తిన్న కుక్కలకు వర్షాలు పడితే రేబిస్ వ్యాధి సోకే ప్రమాదముందని, ఆ కుక్కలు మనుషులను కరిస్తే రేబిస్ వ్యాధి మనుషులకు సోకే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కళేబరాలు రోడ్డు పక్కనే ఉండడంతో దుర్వాసన వెలువడి రహదారిపై వెళ్లే వాహనదారులు నానా ఇక్కట్లకు గురవుతున్నారు. కావున తక్షణమే రహదారి పక్కన మృత కళేబరాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెన్‌పహాడ్ : సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ యాదగిరి అన్నారు. శనివారం మండల కేంద్రంలో సైబర్ నేరాలపై ప్రజలకు నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ నంబర్లను లిఫ్ట్ చేయకూడదని, బ్యాంకు, ఆధార్, సెల్ ఫోన్ నంబర్లను పరిచయం లేని వ్యక్తులకు ఇవ్వకూడదని సూచించారు. సైబర్ నేరాల నిర్మూలన కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతన జీఓ అమలు చేయాలి

కోదాడఅర్బన్ : మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతన జీఓను అమలు చేసి నెలకు రూ.25వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మిట్టగడుపుల ముత్యాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన మధ్యాహ్న భోజన కార్మికుల పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం శ్రీదేవా స్వచ్ఛంద సేవా సంస్థ అనే కొత్త సంస్థను తీసుకొచ్చి కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. గత 20 సంవత్సరాలుగా పోరాటం చేసి స్వచ్ఛంద సేవా సంస్థలను వెనక్కు తరిమినా మళ్లీ వాటిని ముందుకు తీసుకొచ్చి కార్మికులపై రుద్దడం తీవ్రమైన చర్య అన్నారు. పాఠశాలల్లో వంటశాలలు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గురజాల తిరపతమ్మ, సుంకర అన్నపూర్ణమ్మ, రామానుజమ్మ, నాగలక్ష్మి, రమణ, పద్మ, సుజాత, సైదమ్మ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో ఆందోళన

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని లింగగిరిరోడ్డులో ఉన్న ఓ బంకులో పెట్రోల్ కొట్టిస్తే నీళ్లు వస్తున్నాయని శనివారం పలువురు వినియోగదారులు బంకు నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన వాహనాల్లో నీళ్లు కలిసిన పెట్రోల్ పోస్తుండటంతో మరమ్మతులకు గురవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ భారం ఎవరు భరిస్తారని బంకు నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. ఇంతలో పలువురు అక్కడకు చేరుకుని వారిని సముదాయించి పంపించారు. ఈ విషయమై బంకు పార్టనర్ భాస్కర్‌ను వివరణ కోరగా పెట్రోల్‌లో ఎటువంటి అవకతవకలు జరగలేదని, కావాంటే పెట్రోల్ పరీక్ష చేయించుకోవచ్చని తెలిపారు. ఇదంతా గిట్టని చేస్తున్న ప్రచారం అని అన్నారు.

రుణమాఫీలో ప్రభుత్వం విఫలం

నేరేడుచర్ల : బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన లక్ష రూపాయల రుణ మాఫీ చేయడంలో విఫలం అయిందని సీపీఎం మండల కార్యదర్శి సిరికొండ శ్రీను డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పెంచికల్‌దిన్న అరిబండి లక్ష్మీనారాయణ, ఓంకార్ స్మారక భవన్‌లో నిర్వహించిన మండల పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రెండవ సారి అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ నేటికీ రుణ మాఫీ చేయకపోవడం అన్యాయమన్నారు. రుణ మాఫీ కాకపోవడంతో బ్యాంకుల్లో అప్పులు పెరిగి, కొత్త రుణాలు ఇవ్వక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రుణమాఫీని ఒకే విడతలో అమలు చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల నాయకులు మర్రి నాగేశ్వర్‌రావు, కట్ట మధుబాబు, అల్వాల శ్రీధర్, ధనుంజయ్‌గౌడ్, పాలకూరి రాములమ్మ, మచ్చ సోమయ్య తదితరులున్నారు.



పెంచికల్‌దిన్నలో మాట్లాడుతున్న సిరికొండ శ్రీను

స్థలం కొనిచ్చి.. భరోసా కల్పించి



మిత్రుడి కుటుంబసభ్యులకు స్థలం పత్రాలు అందజేస్తున్న మిత్రులు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన లంజేపల్లి మంగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1997వ సంవత్సరంలో అతనితో పాటు పదవ తరగతి కలిసి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు పేదరికంలో ఉన్న మంగయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని సంకల్పించారు. పూర్వ విద్యార్థులంతా కలిసి విరాళాలు సేకరించి గ్రామంలో కొంత స్థలాన్ని కొనుగోలు చేసి స్థలానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను శనివారం మంగయ్య భార్య రేణుకకు అందచేసి అండగా నిలిచారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జగదీషన్న కప్ క్రీడలు



క్రీడాకారులు, గ్రామస్తులతో మంత్రి జగదీష్‌రెడ్డి తనయుడు వేమన్‌రెడ్డి

సూర్యాపేట రూరల్ : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి చేపట్టిన జగదీషన్న కప్ క్రీడాపోటీలు శనివారం రెండో రోజు ముమ్మరంగా కొనసాగాయి. మండల పరిధిలోని రామ్లతండా, లక్ష్మీతండాల్లో జరుగుతున్న క్రీడలను మంత్రి జగదీష్‌రెడ్డి తనయుడు గుంటకండ్ల వేమన్‌రెడ్డి తిలకించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జగదీష్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం, సర్పంచ్‌లు వాంకుడోతు స్వప్న నాగరాజు, సూర్యనాయక్, బీఆర్ఎస్ నాయకులు సేవనాయక్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లైనా పూర్తికాని భవన నిర్మాణం



రామాపురంలోని ప్రభుత్వ పాఠశాలలో నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణం

నడిగూడెం : మండల పరిధిలోని రామాపురం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు ఐదేళ్లుగా నిలిచిపోయాయి. రూ.24 లక్షల వ్యయంతో చేపట్టిన గదుల నిర్మాణ పనులు మొదట వేగంగానే జరిగినా ఆ తర్వాత కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు. కాగా పాఠశాలలో తరగతి గదుల సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులకు ఉపాధ్యాయులు వరండాలో, చెట్ల కింద పాఠాలు బోధిస్తున్నారు. కావున సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులు, గ్రామస్తులు కోరుతున్నారు.